నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
23-07-2025
పేజీలు: 02

## సెంచరీ చేసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్



ఇంగ్లండ్ పర్యటనలో టీ20 సిరీస్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. వన్డే సిరీస్‌నూ కైవసం చేసుకునే క్రమంలో బ్యాటింగ్‌లో అదరగొట్టింది. ఆతిథ్య జట్టుతో డర్హమ్ వేదికగా జరిగిన చివరి వన్డేలో మొదట బ్యాటింగ్ చేస్తూ 50 ఓవర్లకు 318/5 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (102) తన కెరీర్‌లో ఏడో శతకంతో కదం తొక్కగా జెమీమా (50), హర్లీన్ (45), మంధన (45) రాణించారు. ఆఖర్లో రిచా ఘోష్ (38★) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో అలరించడంతో టీమ్ఇండియా భారీ స్కోరు చేసింది. 40 ఓవర్లకు భారత్.. 198/3తోనే ఉన్నా ఆఖరి 60 బంతుల్లో ఏకంగా 120 పరుగులు రాబట్టింది. 54 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసిన హర్మన్ ప్రీత్ తర్వాత శతకానికి 28 బంతులు మాత్రమే తీసుకుంది.



## ‘పవర్‌హౌస్’ సాంగ్ విడుదల

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ‘కూలీ’ చిత్రం నుంచి తాజాగా ‘పవర్‌హౌస్’ అనే మూడవ పాట విడుదలైంది. ఈ పాట లిరికల్ వీడియోను హైదరాబాద్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గ్రాండ్‌గా విడుదల చేశారు మేకర్స్. ఈ ‘పవర్‌హౌస్’ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించడమే కాకుండా, అరివుతో కలిసి ఆలపించారు. మాస్ బీట్స్, ర్యాప్ స్టైల్‌తో ఈ పాట శ్రోతలను ఉర్రూతలూగిస్తోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ సాధించి, చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ సినిమా నుండి “చికిటు”, “మోనికా” అనే రెండు పాటలు విడుదలై సూపర్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెకెక్కుతున్న ఈ భారీ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతి హాసన్, అమీర్ ఖాన్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పూజా హెగ్డే ఒక ఐటెం సాంగ్‌లో నర్తించనున్నారని తెలుస్తోంది. కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ట్రంప్ ఆరోపణలపై ఒబామా సీరియస్



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాపై తీవ్ర ఆరోపణలు చేసి ఆయన జైలుకు వెళ్లడం ఖాయం అని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్న విషయం తెలిసిందే. ఓవల్ ఆఫీస్‌లో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు ఒబామాను విచారిస్తున్నట్టు ఏఐ సహాయంతో రూపొందించిన వీడియోను కూడా ట్రంప్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రంప్ వైఖరిపై బరాక్ ఒబామా స్పందించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ట్రంప్ ఇలా చేస్తున్నారని విమర్శించారు. ట్రంప్ ఆరోపణలపై స్పందిస్తూ.. ఒబామా ప్రతినిధి పాట్రిక్ రోడెన్‌బుష్ ఓ ప్రకటన విడుదల చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైళ్లను విడుదల చేయడంలో వైఫల్యంపై పెరుగుతున్న నిరసన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఒబామాపై ట్రంప్ విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఒబామాపై చేసిన ఈ విమర్శలు అర్థంలేనివని కొట్టిపడేశారు. ఆ ఆరోపణలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ముందు ఎప్‌స్టీన్ స్కామ్‌కు సంబంధించి పూర్తి సమాచారాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాగా, గత వారం యూఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తుల్సీ గబ్బార్డ్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.

# మరోసారి రికార్డు ధర పలికిన పులస చేప

## 2 కిలోల పులసకు రూ.26వేలు

### యానాంలో గంగపుత్రుల వలకు చిక్కిన 2 కేజీల పులస

### రూ.26 వేలకు కొనుగోలు చేసిన ఆత్రేయపురం పేరవరంకు చెందిన బెజవాడ సతీష్




పుస్తెలమ్మైనా పులస తినాల్సిందే.. గోదావరి జిల్లాలో బాగా వినిపించే మాట ఇది. పులస చేపకు ఉండే క్రేజ్ ఇది. గోదావరికి వరద నీటి తాకిడి పెరిగిడంతో పులసల సీజన్ కూడా మొదలైంది.. గోదావరి ప్రాంతంలో పులసల జాతర నడుస్తోంది. గోదావరి తీరానికి సమీపంలో ఉండే యానాం ప్రాంతంలో ఈ చేపలు దొరుకుతుండటంతో అక్కడికి చేపల ప్రియులు క్యూ కడుతున్నారు. యానాంలో మరోసారి పులస చేప రికార్డు ధర పలికింది. 2 కేజీల పులసకు రూ.26వేలు ధరను వెచ్చించి కొనుగోలు చేవారు. ఈ చేపను ఆత్రేయపురం పేరవరం వాసి సతీష్ వేలంలో దక్కించుకున్నారు. వారంరోజుల్లోనే రికార్డు ధరకు అమ్ముడుపోయాయి రెండు పులసలు. మొన్న 18వేలు.. నిన్న 22వేలు.. ఇప్పుడు 26వేలు ధర పలకడంతో మత్స్యకారుల పంట పండినట్లయింది. నైరుతి ఎఫెక్ట్‌తో ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతుండటంతో పులసల సందడి కూడా మొదలైంది. యానాం పుష్కర్ ఘాట్ వద్ద కేజీపైన ఉన్న పులస చేపను మత్స్యకారులు వేలం వేశారు. పులసలు సంతానోత్పత్తి కోసం సముద్రం నుంచి గోదావరిలోకి వెళుతూ వలకు చిక్కుతాయని, గోదావరికి ఔషధ గుణాలున్న ఎర్ర నీరు వచ్చినప్పుడు.. ఈ చేపలు అందులో ఎదురీదటం వల్లనే దీనికి అంతరుచి అని మత్యకారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు పడుతున్నాయని, వచ్చే రెండు నెలల్లోనూ పులసలు విరివిగా దొరుకుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు మత్యకారులు. ఉభయ గోదావరి జిల్లాల్లో పులస చేపలకు మంచి పేరున్నా.. ఏటికేడు వాటి లభ్యత తగ్గిపోతోందని వారు తెలిపారు. గతంలో గోదావరి జిల్లాలో ఏడాదికి సగటున 3 టన్నుల పులసలు దొరికేవని, ఇప్పుడు అది రెండు మూడు క్వింటాళ్లకు పడిపోయిందని వారు చెబుతున్నారు.





## జూలై 26న ‘మిరాయ్’ ఫస్ట్ సింగిల్ విడుదల

తేజ సజ్జ హీరోగా రితికా నాయక్ హీరోయిన్‌గా “ఈగల్” సినిమాతో మన టాలీవుడ్ లోకేష్ కనగరాజ్ అనిపించుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని కలయికలో చేస్తున్న భారీ పాన్ వరల్డ్ లెవెల్ చిత్రమే “మిరాయ్”. వరల్డ్ క్లాస్ విజువల్స్ తో అందరినీ ఆశ్చర్యపరిచిన ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ ని అనౌన్స్ చేసేసారు. హనుమాన్ కి వర్క్ చేసిన సంగీత దర్శకుడు గౌర హరి ఈ సినిమాకి కూడా సంగీతం అందిస్తుండగా వైబ్ ఉంది అనే ఫస్ట్ సింగిల్ ని ఈ జూలై 26న విడుదల చేస్తున్నట్టుగా లీడ్ జంటపై మంచి పోస్టర్ తో అనౌన్స్ చేశారు. పాన్ ఇండియా భాషల్లో ఈ సాంగ్ ని ఒకేసారి విడుదల చేస్తున్నారు. ఇక ఈ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తుండగా ఈ సెప్టెంబర్ 5న గ్రాండ్ గా రిలీజ్ కి తీసుకొస్తున్నారు.



## కొనసాగుతున్న ఆందోళనలు.. ఉభయసభలు వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మూడో రోజైన బుధవారం కూడా ఉభయ సభల్లో విపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభం కాగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సరవణపై ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణపై చర్చకు డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ ప్రజాస్వామ్యా హక్కులకు విఘాతమని పేర్కొన్నారు. ఈ మేరకు పలువురు ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. వాయిదా తీర్మానాలపై చర్చకు సభ్యులు డిమాండ్ చేశారు. విపక్షాల ఆందోళనల మధ్య ఉభయసభలు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.




## కరుప్పు టీజర్ రిలీజ్

తమిళ స్టార్ హీరో సూర్య ఇటీవల వరుస పరాజయాలతో సతమతమవుతున్నాడు. కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నటుడిగా, స్టార్ హీరోగా మన్ననలు అందుకున్న సూర్య భిన్నమైన పాత్రలకు పెట్టింది పేరు. ‘గజిని’ మూవీతో తెలుగులోనూ ఎంతో మంది ఆయనకు అభిమానులుగా మారిపోయారు. ఇతర హీరోలకు భిన్నంగా విభిన్నమైన కథలు ఎంచుకోవడం, కథా ప్రాధాన్యమున్న సినిమాలు చేస్తాడని సూర్యకి మంచి పేరుంది. అయితే ఇటీవల సూర్యకి కలిసిరావడం లేదు. ఆయన ఏ సినిమా చేసిని ఫ్లాప్ అయిపోతుంది. ఎన్నో ఆశలతో చేసిన ‘కంగువా’ డిజాస్టర్ కావడంతో సూర్యని చాలా నిరాశపరిచింది. దీంతో కార్తీక సుబ్బరాజు డైరెక్షన్లో చేసిన ‘రెట్రో’పై ఎన్నో ఆశలు పెట్టుకోగా అది కూడా ఫ్లాప్‌గానే మిగిలిపోయింది. సూర్య తాజాగా ‘ కరుప్ప ’ అనే చిత్రంలో నటిస్తున్నాడు. డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ మూవీలో త్రిష హీరోయిన్. ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి సంబంధించిన టీజర్‌ని సూర్య బర్త్‌డే సందర్భంగా బుధవారం విడుదల చేశారు. ‘కొబ్బరికాయ కొట్టి కర్పూరం వెలిగిస్తే శాంతించే దేవుడు కాదు_ _ _ మనసులో మొక్కుకొని మిరపకాయలు దంచితే రుద్రడై వచ్చే దేవుడు..’ అనే డైలాగ్‌తో టీజర్ మొదలైంది. ఇందులో సూర్య చాలా గెటప్పులో కనిపిస్తున్నాడు.



## శ్రద్ధా కపూర్ హాట్ లుక్స్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. దేవర తర్వాత తారక్ నటిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రాన్ని పక్కా మాస్ యాక్షన్ డ్రామాగా తీసుకురానున్నారట. ఇందులో తారక్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుందని సమాచారం. తాజాగా ఈ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ హీరోయిన్ సైతం ఎంపిక చేశారట. ఆమె మరెవరో కాదు.. శ్రద్ధా కపూర్. ఈ సినిమాలో హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఓ కీలకపాత్రలో కనిపించనుందని.. అలాగే తారక్, శ్రద్ధా మధ్య ఓ సాంగ్ కూడా ఉండనుందని తెలుస్తోంది. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపిందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారట. ఈ సినిమాలో ఆమె పాత్ర కథకు అనుగుణంగా సెకండ్ ఆఫ్ లో వస్తుందని సమాచారం. అయితే ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న ఈ వార్తలలో ఎంతవరకు నిజముంది అనేది తెలియాల్సి ఉంది.శ్రద్ధా కపూర్ గతంలో ప్రభాస్ సరసన సాహో చిత్రంలో నటించింది. ఈ మూవీకి పాజిటివ్ టాక్ వచ్చింది. కానీ ఈ సినిమా తర్వాత తెలుగులో శ్రద్ధా కపూర్ మరో సినిమా చేయలేదు.

## బండి సంజయ్, ఈటెల వివాదంపై ఎంపీ అరవింద్ షాకింగ్ రియాక్షన్


కేంద్రమంత్రి బండి సంజయ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో నేతల మధ్య ఉన్న వైరంపై కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇవాళ(బుధవారం) ఎంపీ అరవింద్ ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నాడు.. ఆ పార్టీ హై కమాండ్ ఏం చేస్తోంది. అలాగే కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని వివాదాలు నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటెల రాజేందర్, బండి సంజయ్‌ల విషయంలో కూర్చోని మాట్లాడాలని సూచించారు ఎంపీ అరవింద్. అవసరమైతే బీజేపీ అధిష్టానం పెద్దలు మాట్లాడాలని చెప్పకొచ్చారు. ఈటెల, బండి సంజయ్‌ల విషయంలో బీజేపీ కేంద్ర హై కమాండ్ నోడల్ ఎంక్వైరీ కమిషన్ వేసుకోవాలని సూచించారు. రాజాసింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని.. ఆయన ఐడియాలాజికల్ మ్యాప్ అని అభివర్ణించారు. ఆయన సస్పెండ్ కాలేదని.. రిజైన్ చేశారని గుర్తుచేశారు. రాజాసింగ్ రేపు పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇస్తే మెంబర్‌షిప్ తీసుకోవచ్చని సూచించారు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రాజీనామా చేశారని చెప్పకొచ్చారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని కోరారు ఎంపీ అరవింద్. ఎంపీలు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని.. ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలని అన్నారు.



## సూర్యాపేటలో ప్రాణం తీసిన వాట్సాప్ ఎమోజీ



సూర్యాపేట జిల్లాలో దారుణం వెలుగులోకి వచ్చింది. పద్మశాలీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్ లో ఎమోజీ పెట్టినందుకు హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 3న పద్మశాలీ సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. పద్మశాలి సంఘం అధ్యక్ష పదవి కోసం శ్రీరాముల రాములు, ఎలగందుల సుదర్శన్ మధ్య పోటీ నెలకొంది. మాజీ అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్ టార్గెట్ గా శ్రీరాముల రాములు వాట్సప్ గ్రూపులో సందేశాలు పెట్టాడు. అప్పం శ్రీనివాస్ కు మద్దతుగా కృపాకర్ ఎమోజీ పోస్ట్ చేశాడు. రాములు ఆగ్రహంతో కృపాకర్‌కు ఫోన్ చేసి బూతులు తిట్టాడు. కృపాకర్ వెంటనే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసేందుకు పద్మశాలీ భవన్‌కు వెళ్లాడు. రాములు తన కుమారుడు ధనుంజయ్‌తో పాటు మరికొందరు స్నేహితులతో కృపాకర్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని పరీక్షించిన వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తిరుపతిలో ట్రైలర్ ఈవెంట్

యంగ్ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్‌డమ్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని జూలై 31న విడుదల చేస్తున్నారు. ఇక ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ ట్రైలర్‌ను జూలై 26న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ మేరకు ఓ పోస్టర్‌ను వారు రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను తిరుపతిలో నిర్వహించబోతున్నట్లు వారు అధికారికంగా ప్రకటించారు. తిరుపతి పట్టణంలోని నెహ్రూ స్టేడియంలో ఈ ఈవెంట్‌ను గ్రాండ్ స్కేల్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఎలా జరగబోతుందా అనే ఆసక్తి నెలకొంది. కింగ్‌డమ్ ప్రమోషన్స్‌లో బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా భాగం కానున్నట్టుగా తెలిసింది. ఇక ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయమని.. సత్యదేవ్ పాత్ర కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రెండు రోజుల పాటు ఆయన అక్కడే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో పార్టీ ఎంపీలతో ఢిల్లీలో సమావేశం కానున్నారు. బీసీ కులగణన సర్వేపై ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇవ్వనున్నట్లు సమాచారం. అలాగే బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి చేసేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.



## కొత్త రేషన్ కార్డులు .. మండలాల్లోనే పంపిణీ

కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణ ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. తెలంగాణ ప్రత్యేకంగా రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రేషన్ కార్డుల పంపిణీ ఆశించిన మేర జరగలేదు. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ.. తాము అధికారంలోకి రాగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుంది. లక్షల సంఖ్యలో రేషన్ కార్డు దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని పరిశీలించిన తర్వాత అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి రేషన్ కార్డులు పంపిణీ మొదలు పెట్టింది ప్రభుత్వం. జులై 14 నుంచే తెలంగాణలో రేషన్ కార్డుల పంపిణీ లాంఛనంగా ప్రారంభం అయ్యింది. మరో మూడు రోజుల్లో అనగా జులై 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీ అమలు చేయనున్నారు. ఆగస్టు 10 వరకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి అధికారులు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు.. దాదాపు 15 రోజుల పాటు రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా మంత్రులు, ఇంచార్జీ మంత్రులతో పాటుగా స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేస్తూ.. అన్ని మండల కేంద్రాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. 7 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 96.65 లక్షల రేషన్ కార్డులున్నాయని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ చేస్తున్నప్పటి నుంచి రేషన్ కార్డులకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సీఎం చెప్పకొచ్చారు. అలానే కొత్త రేషన్ కార్డుల స్టేటస్ తెలుసుకునేందుకు పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ https://epds.telangana.gov.in/FoodSecurityAct/ ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నా కూడా మీసేవా కేంద్రాల్లో సవరించుకోవచ్చు అని తెలిపారు. అలానే రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని.. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్డు రాని వారు ఇబ్బంది పడాల్సిన పని లేదని.. మీ సేవా కేంద్రాల్లో అప్లై చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అలానే ప్రజాపాలనలో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇక మూడు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డుల పంపిణీ మొదలు కాబోతుండటంపై జనాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సర్పంచ్ ఎన్నికల తర్వాతే ఉద్యోగుల బదిలీలు

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ కీలక అలర్ట్ జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగియాగానే వారికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇంతకు ఈనిర్ణయం దేని గురించి అంటే.. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి. వాస్తవానికి ప్రభుత్వం ఈనెలలోనే ఉద్యోగుల సాధారణ బదిలీ ప్రక్రియ చేపట్టాలని భావించింది. కానీ త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో.. ఇబ్బంది పడాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం బదిలీల ప్రక్రియ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. సాధారణంగా రెండు సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీనికి సంబంధించిన ఫైల్.. ఫైనాన్స్ శాఖ నుంచి సీఎంఓకు చేరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈనెలలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా దాన్ని వాయిదా వేశారని తెలుస్తోంది. ఎప్పటికప్పుడు బదిలీలు చేపట్టకపోవడం వల్ల.. ప్రభుత్వంపై ఒత్తిళ్లు, పైరవీలు, సిఫార్సు లెటర్ల ఒత్తిళ్లు పెరుగుతున్నాయని భావించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై ప్రతి ఏడాది సాధారణ బదిలీలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే గత సంవత్సరం జులైలో సాధారణ బదిలీలు జరిగాయి. ఇక ఈ ఏడాది జులైలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ సంబంధిత ఫైల్‌ను రెడీ చేసి ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించినట్లు సమాచారం. సీఎం ఆమోదం తెలిపితే జులై మొదటి వారం నుంచి నెలాఖరు వరకు ఉద్యోగుల బదిలీ ప్రక్రియ నిర్వహించేవారు. కానీ ఈలోపే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు మొదలయ్యాయి.

## NIMS అరుదైన రికార్డు 6 నెలల్లో 100 కిడ్నీ మార్పిడులు!




హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కు చెందిన యూరాలజీ విభాగం సర్జరీ రంగంలో మరింత ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతోంది. 1989లో విభాగం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు, నిమ్స్ మూత్రపిండ మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్) శస్త్రచికిత్సలకు నమ్మకమైన చిరునామాగా నిలిచింది. దీర్ఘకాల అనుభవం, అంకితభావం కలిగిన వైద్య సిబ్బంది, ఆధునిక సాంకేతికత కలగలిసి ఈ విభాగాన్ని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయికి తీసుకొచ్చాయి. NIMS అరుదైన రికార్డు 6 నెలల్లో 100 కిడ్నీ మార్పిడి (Kidney Transplant) శస్త్రచికిత్సలు విజయవంతం! హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ప్రభుత్వ వైద్య సంస్థ నిమ్స్ (NIMS) మరో ఘనత సాధించింది. గడచిన 6 నెలల్లోనే 100 కిడ్నీ మార్పిడీ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఒక అరుదైన రికార్డును నమోదు 6 నెలలు (సుమారుగా 2025 జనవరి — జూన్ మధ్య) చేసింది.2015లో సీనియర్ ప్రొఫెసర్, విభాగాధిపతి డా. సి. రామ్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత శస్త్రచికిత్సల సంఖ్య గణనీయంగా పెరిగింది. సీనియర్ ప్రొఫెసర్ డా. రాహుల్ దేవరాజ్‌ల బృందం గత పదేళ్లలో 1000కి పైగా కిడ్నీ మార్పిడులను విజయవంతంగా పూర్తి చేసింది. ముఖ్యంగా గత ఆరు నెలల్లోనే 100 మార్పిడులు చేయడం గమనార్హం.ప్రతి సంవత్సరం 100కి పైగా మార్పిడులు చేస్తూ, గత రెండేళ్లుగా ఈ సంఖ్య మరింత పెరిగింది. నిమ్స్ దేశంలో అత్యధిక కిడ్నీ మార్పిడులు చేసే మూడవ అగ్రశ్రేణి సంస్థలలో ఒకటిగా నిలుస్తోంది. రోబోటిక్ సిస్టమ్ లభ్యతతో సాంకేతికంగా ముందంజలో ఉండి, ఇప్పటివరకు 4 రోబోటిక్ మార్పిడులను విజయవంతంగా పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడులతో పాటు, ఇదే బృందం ప్రతి నెలా 1000కి పైగా ఇతర శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది.

## రకుల్ హాట్ లుక్స్

సినిమా ఇండస్ట్రీలో ఫిట్ నెస్ కు అత్యంత ప్రాధాన్యమిచ్చే హీరోయిన్లలో రకుల్ ప్రీత్ సింగ్ ఒకరు. పెళ్లయ్యాక కూడా రకుల్ ఎంతో స్లిమ్ గా, నాజూకుగా కనిపిస్తుందంటే దానికి ప్రధాన కారణం .. ఫిట్ నెస్ విషయంలో ఆమె తీసుకుంటోన్న శ్రద్ధనే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా టాలీవుడ్ లో ఓ వెలుగు వెలిగింది రకుల్ ప్రీత్ సింగ్. అయితే పెళ్లయ్యాక మాత్రం తన మకాంను బాలీవుడ్ కు మార్చేసింది. ఇప్పుడు అక్కడే వరుసగా సినిమాలు చేస్తోందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే ఫిట్‌నెస్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటుంది రకుల్. జిమ్, యోగా, పైలేట్స్ , కార్డియో, రన్నింగ్, హైకింగ్, గోల్ఫ్ ఇలా వివిధ రకాల వర్కౌట్స్ చేస్తుంటుంది. చేయడమే కాదు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తుంటుంది. తద్వారా తన ఫాలోవర్లకు హెల్త్ అండ్ ఫిట్ నెస్ పై అవేర్ నెస్ కల్పిస్తోంది. తాజాగా ఫిట్ నెస్ రొటీన్‌కు సంబంధించి రకుల్ మరో ఆసక్తికరమైన వీడియోలను షేర్ చేసింది. మనం పెద్దగా పట్టించుకోని 'చిన్న కండరాలకు' కూడా ప్రాధాన్య ఇవ్వాలని, వాటి దృఢత్వం కోసం తగిన వ్యాయామాలు చేయాలని సూచించింది. ఇక మరో వీడియోలో అద్భుతమైన బాలెన్సింగ్‌తో ఆక్వా బాల్ ఎక్సర్ సైజ్ చేసి చూపించింది రకుల్.

